# జాతిభేదం

**శ్రీ మంత్రి శంకర్**

"ఏమోయ్ సూర్యం ?"

"ఏమిటండీ ? శాస్త్రిలుగారూ ?"

ఎంత మారిపోయావబ్బాయీ ? ఇంత అధ్వాన్నానికి పాల్పడతావని నే ననుకోనే లేదోయ్.

ఏ మధ్వాన్నమండీ వింతగా మాట్లాడుతున్నారే ?

ఇంకేం కావాలయ్యా విపరీతం ? ఆ వెధవముండతో సంపర్కమేమిటి ? మాటలూ చేతలేలాగైనా దానింట్లో భోజన పానాదులుకూడా సాగించావంటే, ఊరంతా ఎంత పొక్కిపోతుందో తెలుసా ? మీ తండ్రితాతలు యెంత పూర్వాచార పరాయణులో, బ్రాహ్మణులంటే యెంత భక్తి శ్రద్ధలో ఒక్కటనేమిటి యే విషయంలో ఎత్తుకున్నా ఎంత పేరుప్రఖ్యాతులు గడించారో తెలిసే ఉండొచ్చు. అలాంటివారి గర్భంలో పుట్టి జాతిభేదాలు పాటించకుండా పరువుప్రతిష్టలు పారద్రోలి పాడైపోతూన్నావంటే, నా కెంత ఆయాసంగా ఉందో వేరే చెప్పాలటోయ్.

ఐతే నేనేం తప్పుచేశానని మీ రలా నిందించడం ?

వేరే తప్పేందుకోయ్ ఆ ముండతో సంపర్కమే తప్పు.

సంపర్కమేమిటండీ ? ఆమెను పెళ్ళి చేసుకోబోతున్నాగూడా.

"హర, హర ప్రొద్దుటే లేచి ఎవరి మొహం చూశానో ? ఎంతటి పాపపు మాటలు వినాల్సొచ్చిందయ్యా. వినలేక చెవులు మూసుకుంటున్నా.

ఐతే ఆమె మనలాంటి మనిషి కాదంటారా ? మనకంటే ఆమెలో ఏమి కొదువైందని వేరుచేయడం ?

జాతిభేదం చాలదటోయ్ ముఖ్యమైంది.

జాతిభేదం ఎవరు నిర్ణయించిందంటారు శాస్త్రిలుగారు.

ఎవరో ఏమిటయ్యా దేవుడే...

అదే అవివేకం! జాతిభేదం దేవుడెప్పుడు నిర్ణయించలేదండీ. మనలో మనం నిర్ణయించుకొన్నవే ఈ భేదాలన్నీ.

గ్రుడ్డొచ్చి పిల్లను వెక్కిరించినట్లుగా నాకే బోధించడానికి తయారయ్యావే ?

కోపం చేసుకోకుండా ఒక్క విషయం గమనించండి శాస్త్రిలు. మీరు, పెళ్ళిళ్ళూ శ్రార్ధాలూ చేయించడంలో ప్రవీణులేనండీ. నా కాలా గడ్డం గీకండి చూదాం.

నేనేం మంగలివాణ్ణి కాదయ్యా.

ఔనండీ నేనూ అదే చెప్పడం మంగలాడకి బట్టలుతకడమూ, చాకలాడికి కుండలుచేయడం చేతకానట్టే, మీకు చేతగాదనే చెప్పడం.

ఆ కానీయవోయ్ నీ ఉపన్యాసం. ఎంతవరకూ ఉందో.

అందువల్లే మనలో మన పూర్వీకులు మీబోటి విద్యావంతుల్ని శాస్త్రిలూ, పురాణాలు తిథివార నక్షత్రాలు చెప్పేందుకనీ, మంగలివాండ్ల పేరుతో క్షురకర్మకూ, పండుగా వారాలకు మేళం వాయించేందుకనీ, చాకలివాళ్ళ పేరుతో బట్టలు ఉతికేందుకనీ, మరీ కమ్మరి, కుమ్మరి, మాదిగ, ఇత్యాది భాగాలు భాగించి ఒక్కొక్కరికో వృత్తిని నియమించి, ఒక్కరికొక్కరు, ఆధారంగా అందరి సౌకర్యార్థం ఏర్పరచారు. కానీ, మీబోటి అతివాదులు వారు నీచులనీ, వీరు ఘనులనీ విపరీతాభిప్రాయాలుపడి, మీరు చేసినవే సర్వమూ. మంగల్వాణ్ణి జాతితక్కువవాడని హీనంగా ఎంచుకొంటారే, వాడు కొంచెం చెయ్యి ముడుచుకో నియ్యండి, మీ గడ్డం పెరగడమూ, చాకలాడు బట్టలుతక్కంటే మీ బట్టలు మాయడనూ, చూస్తే మిమ్మల్ని ఏ కడ జాతివానిగానో ఎంచక తప్పుతుందేమో?

సోదరసమానులమైన మనలో మనకే ఈ భేదాభిప్రాయాలు కల్గడంవల్లే మన దేశమూ, మనమూ ఈలా అధోగతిలో అఘోరిస్తున్నాము.

ఏమంటారు శాస్త్రిలు?

అనడాని కేముందయ్యా, కలియుగాంతంలోనూ, నవయుగారంభంలోనూ ఈలాంటివిపరీతాలు కల్గుతాయని శాస్త్రాలే ఘోషిస్తున్నాయి. "వినాశకాలే విపరీత బుద్ధిః" అని మీకు అలా బుద్ధులు పుడుతున్నాయి.

మీరు దయయుంచి శాస్త్రిలు, వేదాల సాక్ష్యంవదలి, స్వబుద్ధితో నా అభిప్రాయాన్ని ఖండించి బోధిస్తే వింటాము కదూ. మరో తమాషా చూడండి. మీరు రాముణ్ణాదర్శంగా తీసుకొని, ఏకపత్నీవ్రతాన్నాదర్శంగా తీసుకోమ్మంటారు కాదామరి.

ముమ్మాటికీ.

మరి నేను కృష్ణున్నాదర్శంగా తీసుకొని పెక్కుమంది భార్యలతో కులాసాగా ఉంటానంటే సమ్మతిస్తారా?

కృష్ణునంతటివారమా మనం అతడు దేవుడు అన్నీ హరించుకొంటాడు. మానవ మాత్రులకు మనకు సాధ్యమా?

రాముడంతటి వారమా మనం?

మరి నీతో వాదించడం నాకు చేత కాదు నాయనా, పూజకు వేళైంది వెళ్ళొస్తా...

మరీ ఓపిగ్గా ఓమారు మా ఇంటికి రండి. మరి మీకు నచ్చచెప్పాల్సిన విషయాలు చాలా ఉన్నాయి.

ఇంకా నీ విపరీతబోధలు విని బుర్ర చెడి నీలోకి లాక్కోవాలనా?

మరైతే నేనే వస్తాలెండి మీ ఇంటికి.

అయ్యో అంతపనీ చేయకోయ్. మా ఇంట్లోదూరి నన్నూ కులభ్రష్టుని చేద్దామనా? నమస్కారమబ్బా అంటూ సాగిపోయాడు శాస్త్రి.